# ఇండియన్ పాలిటీ

## ఎన్నికల సవాళ్లు, సంస్కరణలు

## (Electoral Challenges and Reforms)

ప్రపంచంలో భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. సార్వజనీన వయోజన ఓటు హక్కు ఫలితంగా 81 కోట్ల ఓటర్లకు ఎన్నికలను నిర్వహించడం ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమం. అయితే ఈ ఎన్నికలు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, నీతిమంతంగా జరిగినప్పుడే ఆ ఎన్నికలకు తగిన విలువ ఉంటుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత మెచ్చుకోదగింది అయినప్పటికీ కొన్ని లోపాలు ఉన్నాయి.

అవినీతి, నేర రాజకీయాలు, కుల రాజకీయాలు, మత రాజకీయాలు, ధనప్రాబల్యం, దౌర్జన్యం, ఆక్రమణ, పక్షపాతంతో కూడిన పోలీసు వ్యవస్థ, పత్రికలు, ప్రసార మాధ్యమాలు, లోపాలతో కూడిన మెజారిటీ వ్యవస్థ, జనాభాలో ఇప్పటికీ 25% పైగా ప్రజలు నిరక్షరాస్యులు, 22% పైగా ప్రజలు పేదరికంలో ఉండటం లాంటి అనేక లోపాలను మన ప్రజాస్వామ్య వ్యవస్థలో గమనించవచ్చు.

ఎన్నికలు నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా, సక్రమంగా జరగకపోతే ప్రజల్లో విశ్వాసం సడలుతుంది. ఎన్నికల వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి ప్రభుత్వం, ఎన్నికల సంఘం అనేక చర్యలు తీసుకున్నా, ఇంకా ఎన్నో సవాళ్లు, సమస్యలు మిగిలే ఉన్నాయి.

### భారత ఎన్నికల వ్యవస్థ ముఖ్య లక్షణాలు

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు విడదీయరాని అంతర్భాగం. భారతదేశంలో బహుపార్టీ విధానం అమల్లో ఉంది. ఎన్నికల సంఘం వద్ద నమోదైనవి, ఎన్నికల సంఘం గుర్తింపు పొందినవి; జాతీయ, ప్రాంతీయ పార్టీలు అన్నీ కలిపి మొత్తం 1866 ఉన్నాయి. జాతీయ పార్టీలు 6, రాష్ట్ర పార్టీలు 50 ఉన్నాయి. అత్యధికంగా గుర్తింపు పొందని నమోదైన పార్టీలు కూడా ఉన్నాయి.

★ భారత పౌరులకు సార్వజనీన వయోజన ఓటుహక్కు కల్పించారు. పద్దెనిమిదేళ్లు నిండిన భారతీయులంతా ఓటు హక్కు పొందడానికి అర్హులు. ఓటు హక్కు కల్పించడంలో ఎలాంటి వివక్ష (జాతి, కులం, మతం, పుట్టుక, లింగం, ప్రాంతం, ఆస్తి, విద్య) ఉండదు.

★ పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాష్ట్రాల్లో విధానసభ నియోజక వర్గాలను ప్రదేశం ఆధారంగా విభజిస్తారు. వీటినే ప్రాదేశిక నియోజక వర్గాలు అంటారు. వీటిని నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ కమిటీ సిఫారసుల ఆధారంగా విభజిస్తారు. (ప్రస్తుతం పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం 2026 వరకు నియోజక వర్గాల సంఖ్యను మార్చే అవకాశం లేదు).

★ లోక్‌సభ, రాష్ట్ర విధానసభలకు జరిగే ఎన్నికల్లో రహస్య ఓటింగ్ పద్ధతిని; రాజ్యసభ, రాష్ట్ర విధానపరిషత్ ఎన్నికల్లో బహిరంగ ఓటింగ్ పద్ధతిని (అవినీతిని తగ్గించడానికి) అనుసరిస్తున్నారు.

★ లోక్‌సభ, రాష్ట్ర విధానసభల్లో షెడ్యూల్డ్ కులాలు (లోక్‌సభలో 84), షెడ్యూల్డ్ తెగలకు (లోక్‌సభలో 47), ఆయా వర్గాల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు.

★ పోటీ చేసినవారిలో ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు.

### భారత ఎన్నికల వ్యవస్థ – సవాళ్లు

#### ధనప్రాబల్యం

ఎన్నికల్లో చేసే వ్యయం రెండు రకాలుగా ఉంటుంది. 1) చట్టం అనుమతించిన పరిధిలో చేసే వ్యయం 2) చట్టానికి వ్యతిరేకంగా చేసే వ్యయం. రెండో రకమైన వ్యయం సమాజంలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు అవినీతి పెరగడానికి, ఎన్నికల్లో అక్రమాలకు దారితీస్తోంది.

రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయడానికి సంపదను ఒక అనధికార అర్హతగా పరిగణిస్తున్నాయి. ఓటు మార్కెట్లో అమ్మే వస్తువు, కొనే వస్తువులా మారింది. దీంతో ఎన్నికల్లో కేవలం ధనవంతులు అందులోనూ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, అత్యంత ధనికులు లాంటి వర్గాలను మాత్రమే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా పోటీకి నిలుపుతున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వే ప్రకారం లోక్‌సభలో 2004లో 30%, 2009లో 58%, ప్రస్తుత లోక్‌సభలో 82% సభ్యులు

కోటీశ్వరులు. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని ఎన్నికల్లో నల్లధనాన్ని లేదా ప్రభుత్వానికి లెక్కలు చూపని ధనాన్ని విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. ఒకప్పుడు రాజకీయ పార్టీలకు పారిశ్రామికవేత్తలు విరాళాలు అందించేవారు. ఇప్పుడు నేరుగా వారే ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వస్తున్నారు. సామాజిక సేవా దృక్పథం, సౌమ్యత, సమర్థత, మంచి ప్రవర్తన ఉన్న సామాన్యులు ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో కనిపించడం లేదు. ఎన్నికల్లో చట్టపరిధికి మించి ఖర్చు చేస్తేనే విజయం సాధించగలమనే భావన నెలకొంది.

## హింసా రాజకీయాలు

రాజకీయాల్లో హింస ఒక అంతర్భాగమైంది. ఎన్.ఎన్. వోహ్రా కమిటీ నేర రాజకీయాలపై లోతైన అధ్యయనం చేసి నేరస్తులు, రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసుల మధ్య అనైతిక సంబంధాలపై సవివరమైన నివేదికను సమర్పించారు. చట్టాలను రూపొందించే వారు చట్టాలను ఉల్లంఘించి హింసకు పాల్పడుతున్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సర్వే ప్రకారం ప్రస్తుత 16వ లోక్‌సభలో 53 మంది చాలా తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికైనవారిలో 34% మంది నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. చట్టం పట్ల గౌరవం లేని చట్ట వ్యతిరేకశక్తులు చట్ట నిర్మాతలుగా, దాన్ని అమలుచేసే మంత్రులుగా (కార్యనిర్వాహక శాఖ) చెలామణీ కావడం హాస్యాస్పదం. నేరారోపణలు లేని లోక్‌సభ లేదా రాష్ట్ర శాసనసభ్యులు ఉన్న రాజకీయ పార్టీ భారత రాజకీయాల్లో లేదంటే అతిశయోక్తి కాదు.

## ప్రభుత్వ అధికార యంత్రాంగం, నిధుల దుర్వినియోగం

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు అధికారులను బదిలీల పేరుతో కీలకమైన స్థానాల్లో తమకు అనుకూలంగా, విధేయులుగా పని చేసేవారిని నియమిస్తున్నాయి. పోలీసు యంత్రాంగాన్ని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించేలా ప్రభావితం చేయడం, నిజాయతీగా, నిష్పాక్షికంగా పనిచేసే అధికారులను తరచూ బదిలీ చేస్తున్నారు లేదా అంత ప్రాధాన్యం లేని స్థానాల్లో నియమిస్తున్నారు.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు లాంటి రాజకీయ నాయకులు అధికార కార్యక్రమాల ముసుగులో పార్టీ గురించి ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు పార్టీ కార్యక్రమాలుగా ప్రచారమవుతున్నాయి. ప్రభుత్వ ధనంతో ప్రభుత్వ కార్యక్రమాల విస్తృత ప్రచారం నేపథ్యంలో అధికార పార్టీ నాయకుల చిత్రాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, వాహనాలను అధికార పార్టీ ప్రచార కార్యక్రమాల కోసం ఉపయోగిస్తున్నారు.

## కుల, మత రాజకీయాలు

రాజకీయాలు కులాన్ని, రాజకీయాలను కులం ప్రభావితం చేయడం భారత రాజకీయాల్లో పరిపాటిగా మారింది. కులాన్ని, మతాన్ని ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలకు వాడటాన్ని నిషేధించినా వీటిని దుర్వినియోగం చేయడం తగ్గలేదు. అత్యున్నత న్యాయస్థానం నిషేధించినా కులం, మతం ఆధారంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం రాజకీయ పార్టీలకు అలవాటైంది. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో జనాభా ఉన్న కులానికి లేదా మతానికి చెందినవారినే పోటీలో నిలుపుతున్నారు. ఒక నియోజకవర్గంలో కేవలం ఒక కులం లేదా మతం ఓట్లను ఆధారంగా చేసుకుని ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారు. కుల, మతపరమైన రిజర్వేషన్లు, అధికార స్థానాలు (ముఖ్యమంత్రి, మంత్రి పదవులు), ఆరాధనా కట్టడాలు, సబ్సిడీలు లాంటి వాగ్దానాలు చేయడం ద్వారా సమాజాన్ని మరింత విభజించడానికి, నిర్వీర్యం చేయడానికి దోహదం చేస్తున్నారు.

## మెజారిటీ పద్ధతి

ప్రజాస్వామ్యంలో మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ప్రస్తుత మెజారిటీ పద్ధతిలో మొత్తం ఓట్లలో సగం కంటే ఎక్కువ కాకుండా కేవలం పోటీ చేసినవారిలో అందరికంటే ఎక్కువ ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటించడం ఒక పెద్ద లోపం. దీనివల్ల ఒక నియోజకవర్గంలో కేవలం ఒక కులం లేదా మతం ఓట్లను ఆధారంగా చేసుకుని, ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారు.

## పార్టీ ఫిరాయింపులు

ఒక పార్టీ తరఫున ఎన్నికైన తర్వాత ఆ పార్టీకి కాకుండా వేరొక పార్టీకి విధేయత చూపించడం భారత రాజకీయాల్లో సర్వసాధారణంగా మారింది. అధికారం, పలుకుబడి, పదవులు, ప్రభుత్వ కాంట్రాక్టులు లాంటివి పొందడానికి పార్టీలను ఫిరాయిస్తున్నారు. అయితే ఫిరాయింపులపై లోక్‌సభ, విధానసభలకు సంబంధించి స్పీకర్, రాజ్యసభ, విధాన పరిషత్‌కు సంబంధించి ఛైర్మన్ అంతిమ నిర్ణయాధికారాన్ని కలిగి ఉంటారు. దీనివల్ల సమస్యలు పరిష్కారం కాకపోగా వివాదాస్పద నిర్ణయాలు లేదా నిర్ణయాల్లో అసాధారణ జాప్యం చోటు చేసుకుంటోంది.



www.eenadupratibha.net

## ఎన్నికలు వాగ్దానాలు

ఎన్నికల్లో లెక్కలేనన్ని వాగ్దానాలు చేయడం, ఎన్నికల్లో లబ్ధి పొందిన తర్వాత వాటిని అమలు చేయకపోవడం సాధారణమైపోయింది. వాగ్దానాలను ఏవిధంగా నెరవేరుస్తారో కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలకు ఉన్నప్పటికీ దాన్ని విస్మరించడం భారత రాజకీయాల్లో కనిపిస్తోంది.

## ఎన్నికల సంస్కరణలు

ఎన్నికల వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి అనేక కమిటీలు సూచనలు, సలహాలను పేర్కొన్నాయి. ఉదాహరణకు వి.ఎం. తార్కుండే కమిటీ (1974), దినేష్ గోస్వామి కమిటీ (1990), ఎన్.ఎన్. వోహ్రా కమిటీ (1993), ఇంద్రజిత్ గుప్తా కమిటీ (1998), లా కమిషన్ రిపోర్ట్ (1999), రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్ (2001), ఎన్నికల సంఘం, రెండో పరిపాలనా సంస్కరణల సంఘం (2008), ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఎన్నికలను సక్రమంగా జరిపించడానికి అవసరమైన అనేక చర్యలను తీసుకున్నాయి.

## ఓటు హక్కు పొందే వయసు

ఓటు హక్కు పొందడానికి కనీస వయసును 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 1989లో 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. దీనివల్ల 9వ లోక్‌సభకు (1989లో) జరిగిన సాధారణ ఎన్నికల్లో 18 నుంచి 21 సంవత్సరాల మధ్య వయసున్న 35.7 మిలియన్ యువతీ, యువకులు ఓటుహక్కు పొందారు. దీని ద్వారా ఎన్నికల ప్రక్రియలో యువతను భాగస్వాములను చేశారు.

## ఎన్నికల సిబ్బంది

ఎన్నికల సంఘం విధులైన ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణ లాంటివి నిర్వహించే ప్రభుత్వ సిబ్బందిపై నియంత్రణ, పర్యవేక్షణ ఎన్నికల సంఘానికి ఉండేలా ప్రజాప్రాతినిధ్య సవరణ చట్టం 1988 ద్వారా 13 CC ని చేర్చారు.

## ఎన్నికల్లో పోటీకి అనర్హులు

కొన్ని రకాల నేరాలకు పాల్పడిన వ్యక్తులను 6 సంవత్సరాలపాటు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు. ఉదాహరణకు పోలింగ్ బూత్ ఆక్రమణ, అంటరానితనం పాటించడం, మాదకద్రవ్యాల వినియోగం, స్మగ్లింగ్, కుల, మత, ప్రాంతీయతత్వాలను రెచ్చగొట్టడం, అవినీతికి పాల్పడటం, ఫెరా (FERA) చట్టాన్ని ఉల్లంగించడం మొదలైనవి.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు

ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951ని సవరించి ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (EVM) వినియోగించడానికి అనుమతి పొందారు. 2004లో జరిగిన లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వినియోగించారు.

## జాతీయ చిహ్నాలు

జాతీయ గౌరవ చిహ్నాల చట్టం 1971 ప్రకారం జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగం లాంటి జాతీయ చిహ్నాలను అవమానపరిచే విధంగా ప్రవర్తించినవారిని పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయకుండా 6 సంవత్సరాలు నిషేధిస్తారు.

## ఆషామాషీ (Non–Serious) అభ్యర్థులు

లోక్‌సభ, రాష్ట్ర విధానసభలకు ఆషామాషీగా (Non–Serious) పోటీచేసే అభ్యర్థుల సంఖ్యను తగ్గించడానికి సెక్యూరిటీ డిపాజిట్, ప్రతిపాదించేవారి సంఖ్యను పెంచారు. 1996లో లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు చెల్లించాల్సిన డిపాజిట్ సాధారణ అభ్యర్థులకు రూ.500 నుంచి రూ.10 వేలకు, షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులకు రూ.250 నుంచి రూ.5 వేలకు పెంచారు. రాష్ట్ర శాసనసభకు పోటీచేసే సాధారణ అభ్యర్థులు చెల్లించాల్సిన డిపాజిట్‌ను రూ.250 నుంచి రూ.5 వేలకు, షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులకు రూ.125 నుంచి రూ.2,500 కు పెంచారు.

ఎన్నికల సంఘం జాతీయ లేదా ప్రాంతీయ పార్టీలుగా గుర్తించిన పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులను కనీసం ఒక ఓటరు ప్రతిపాదించాలి. ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటీచేయడానికి కనీసం పదిమంది ప్రతిపాదకులు (ఓటర్లు) అవసరం. ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికలు జరగడానికి మధ్య సమయాన్ని 20 రోజుల నుంచి 14 రోజులకు తగ్గించారు. ఏకకాలంలో జరిగే ఏ ఎన్నికల్లో ఒక వ్యక్తి పోటీచేయగల స్థానాల సంఖ్యను రెండుకు తగ్గించారు. అదేవిధంగా రాజ్యసభ, రాష్ట్ర విధాన

మండలి ఎన్నికల్లోనూ ఆషామాషీగా (Non–Serious) పోటీచేసే అభ్యర్థుల సంఖ్యను తగ్గించడానికి నియోజకవర్గం లేదా ఎన్నికల గణంలోని 10% ఓటర్లు లేదా పదిమంది ఓటర్లు మద్దతిస్తూ నామినేషన్ పత్రంపై సంతకం చేయాలనే నిబంధన విధించారు.

## కండబలం, ఆయుధాలు

ఆయుధాలను ధరించి పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించడాన్ని నిషేధించారు. ఈ నేరానికి 2 సంవత్సరాల జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధిస్తారు. ఆయుధాల లైసెన్సు కూడా రద్దవుతుంది. అయితే ఈ నిబంధనలు రిటర్నింగ్ ఆఫీసర్, ప్రిసైడింగ్ ఆఫీసర్, శాంతిభద్రతల నిర్వహణలో ఉన్న పోలింగ్ సిబ్బందికి వర్తించవు.

## విద్య, ఆస్తి – అప్పులు, నేరచరిత్ర

అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులంతా తమ విద్యార్హతలు, తమ పేరుతో, కుటుంబసభ్యుల పేరుపై ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలు, నామినేషన్ దాఖలు చేయడానికి ముందు 6 నెలల కాలం వరకు పోటీచేసే అభ్యర్థిపై ఉన్న కేసుల వివరాలను నిర్ణయించిన పద్ధతిలో నామినేషన్‌తోపాటు సమర్పించాలి.

## ఎవరూ నచ్చకపోవడం (NOTA)

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోటీచేసే అభ్యర్థులు ఎవరూ నచ్చనప్పుడు ఎవరో ఒకరికి కాకుండా ఎవరూ నచ్చలేదనే అవకాశాన్ని (Option) ఎన్నికల సంఘం NOTA పేరుతో 2015 నుంచి అమలు చేస్తోంది. దీనివల్ల ఎన్నికల ఫలితాలు మారనప్పటికీ పోటీచేసే అభ్యర్థులపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతను తెలుసుకోవచ్చు.

## ఓటర్ వెరిఫియబల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (VVPAT)

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడు, ఓటరు తన ఓటు సక్రమంగా నమోదయ్యిందో లేదో తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం ఈ పద్ధతిని అమలు చేస్తోంది. దీనివల్ల ఓటరుకు అనుమానం నివృత్తి చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర్‌రాజు**